త్వరలోనే.. చటాన్‌పల్లి ఆర్వోబీ పనులు ప్రారంభం

రూ.190 కోట్లు వెచ్చిస్తున్నాం

రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్, జూలై 15 : కొన్నేండ్లుగా షాద్‌నగర్ ప్రజలు, వాహనదారులు ఎదురుచుస్తున్న చటాన్‌పల్లి ఆర్వోబీ పనులు మరో 15 రోజుల్లో ప్రారంభం కానున్నట్లు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్లలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు వెళ్తున్న మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావులకు షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్ షాద్‌నగర్ బైపాస్ రోడ్డులో నాయకులతో కలిసి సోమవారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విలేకరులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. చటాన్‌పల్లి రైల్వే ఓవర్‌బ్రిడ్జి నిర్మాణానికి రూ. 190 కోట్లను వెచ్చించనున్నట్లు చెప్పారు. ఆ వంతెన పనులను త్వరగా పూర్తి చేస్తామన్నారు. అదేవిధంగా హైదరాబాద్ నుంచి కర్నూల్ వరకు గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం రూ.5వేల కోట్లతో అంచనాలు రూపొందించినట్లు.. ఈ విషయంపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరితో మాట్లాడినట్లు ఆయన తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

నియోజకవర్గంలోని కొందుర్గు మండలం అగిర్యాల గ్రామంలో రూ. కోటితో ఏర్పాటు చేసిన విద్యుత్తు 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎమ్మెల్యే శంకర్ సోమవారం ప్రారంభించి మాట్లాడారు. విద్యుత్తు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. అదేవిదంగా రూ. 25 లక్షలతో చేపట్టనున్న నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్తు అధికారులతో కలిసి మొక్కను నాటారు. అదేవిధంగా లాల్‌పహాడ్ నుంచి కంకల్ మధ్య రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడుతూ.. పదిన్నర కిలోమీటర్ల పొడవు గల ఈ రోడ్డు నిర్మాణానికి రూ.14.70 కోట్లను వెచ్చించనున్నట్లు తెలిపారు.

మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావులకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే శంకర్

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల కలెక్టర్లు శశాంక, ప్రతీక్‌జైన్

వినతులు స్వీకరించి.. పరిష్కారానికి ఆదేశించి

ప్రజావాణికి రంగారెడ్డి జిల్లాలో 120, వికారాబాద్ జిల్లాలో 84 వినతులు రాక

రంగారెడ్డి, జూలై 15 (నమస్తే తెలంగాణ) : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణికి 120 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు అందజేసిన అర్జీలను కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డితో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసమే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, తహసీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెం డెంట్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వికారాబాద్‌లో 84 ఫిర్యాదులు

వికారాబాద్ : ప్రజావాణి ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా తక్షణమే పరిష్కరించాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశం హాలులో జరిగిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్య, వైద్యం, బీసీ, గిరిజన సంక్షేమం, విద్యుత్తు, పంచాయతీ, పింఛన్లు, మున్సిపాలిటీ, ధరణి, భూసర్వే తదితర అంశాలకు సంబంధించి 84 ఫిర్యాదులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, ఆర్డీవో వాసుచంద్ర, అధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని..

అక్షయపాత్రకు ఇవ్వొద్దు

తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్

అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

రంగారెడ్డి, జూలై 15 (నమస్తే తెలంగాణ) :మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ బాధ్యతలను అక్షయపాత్ర ఫౌండేషన్‌కు ఇచ్చేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) జిల్లా కార్యదర్శి జైపాల్‌రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి, ప్రధాన కార్యదర్శి పర్వతాలు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహేశ్వరం, బాలాపూర్, అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్, కొత్తూరు, నందిగామ, శంషాబాద్ మండలాల్లో మధ్యాహ్న భోజన ఏజెన్సీ బాధ్యతలను అక్షయపాత్ర ఫౌండేషన్‌కు ఇచ్చేందుకు అధికారులు నిర్ణయించారని తెలిపారు. దీనివల్ల గత 23 ఏండ్లుగా మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ బాధ్యతలు నిర్వర్తిస్తున్న కార్మిక కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి చందుయాదవ్, మధ్యాహ్న భోజన కార్మికులు మంజుల, సంతోష, అండాళు, రాములమ్మ, పద్మ తదితరులు ఉన్నారు.

పింఛనర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రభుత్వ పింఛనర్ల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట తెలంగాణ ప్రభుత్వ పింఛన్‌దారుల సంయుక్త కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సం దర్భంగా సమితి చైర్మన్ లక్ష్మయ్య, జనరల్ సెక్రటరీ శుభాకర్‌రావు మాట్లాడుతూ బకాయి ఉన్న నాలుగు కరువు భత్యాల వాయిదాలను వెంటనే విడుదల చేయాలని, ఈహెచ్‌ఎస్ స్కీంలో అన్ని కార్పొరేట్ దవాఖానల్లో నగదు రహిత చికిత్సను వర్తింపజేయాలన్నారు. హైదరాబాద్ జంట నగరాల్లో పది వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రాన్ని అందజేశారు. నిరసనలో సమితి ప్రతినిధులు నాగేశ్వర్ రావు, కృష్ణ, సురేందర్‌రెడ్డి, సోమిరెడ్డి పాల్గొన్నారు.

భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

పవర్ గ్రిడ్ కార్పొరేషన్ చేపడుతున్న బీదర్–మహేశ్వరం 765 కేవీ పవర్ ట్రాన్స్‌మిషన్ లైన్‌లో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం పరిహారాన్ని చెల్లించాలంటూ సోమవారం కలెక్టరేట్‌లో తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చాంబర్ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల, షాబాద్, కేశంపేట, కొందుర్గు, ఫరూఖ్‌నగర్, కడ్తాల్, కందుకూరు మండలాల మీదుగా లైన్ ఏర్పాటు చేయడంతోపాటు టవర్ల నిర్మాణాన్ని చేపడుతున్నారని తెలిపారు. టవర్ నిర్మాణంలో 12 గుంటల భూమి, లైన్ ఏర్పాటులో మరో 12 గుంటల భూమిని రైతులు కోల్పోవాల్సి వస్తున్నదని.. ఈ లెక్కన రాష్ట్రవ్యాప్తంగా 165 కిలోమీటర్ల మేర చేపడుతున్న ట్రాన్స్‌మిషన్ లైన్‌లో 3000 ఎకరాల భూమిని కోల్పోవాల్సి వస్తుందన్నారు. జిల్లాలో భూములకు ఎంతో డిమాండ్ ఉండగా.. పంటనష్టం, నరికివేసిన చెట్లకు మాత్రమే పరిహారం ఇస్తామని అధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు. భూసేకరణ చట్టాలు, ఎల్కక్టిసిటీ యాక్ట్‌కు అనుగుణంగా రైతులకు న్యాయపరంగా మార్కెట్ విలువ ప్రకారం పరిహారం చెల్లించాలన్నారు.

పేదలకు ఇచ్చిన నోటీసులను ఉపసంహరించుకోవాలి

శేరిలింగంపల్లి మండలం, మియాపూర్ పరిధిలోని ముజఫర్ అహ్మద్‌నగర్‌లో గత 35 ఏండ్లుగా నివాసం ఉంటున్న పేదలకు ఇచ్చిన నోటీసులను ఉపసంహరించుకోవాలంటూ ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంసీపీఐ(యూ) గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శివర్గ సభ్యుడు దశరథ్‌నాయక్ మాట్లాడుతూ సర్వే నం. 100 లోని భూమిలో నిరుపేదల నివాసాలకు ఇంటి నంబర్లను కేటాయించడంతోపాటు అన్ని రకాల వసతులను కల్పించారని.. ఇప్పుడు రెవెన్యూ, హెచ్‌ఎండీఏ అధికారులు నోటీసులు ఇవ్వడం సమంజసం కాదన్నారు. నోటీసులను వెంటనే ఉపసంహరించుకుని పేదల నివాసాలకు చట్టబద్ధత కల్పించాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సుధాకర్, గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శివర్గ సభ్యులు సుకన్య, కళావతి, భాగ్యమ్మ, మురళి, పుష్ప, తుకారాంనాయక్ ఉన్నారు.

రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న పింఛనర్లు

శిక్షణకు హాజరైన పీహెచ్‌సీల డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది

జేఈ టీకాపై అవగాహన కలిగి ఉండాలి

వికారాబాద్ డీఎంహెచ్‌వో డాక్టర్ పాల్వన్‌కుమార్

వికారాబాద్, జూలై 15 : డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది మెదడువాపు వ్యాధి నివారణకు ఇచ్చే జేఈ టీకాపై అవగాహన కలిగి ఉండాలని వికారాబాద్ డీఎంహెచ్‌వో డాక్టర్ పాల్వన్‌కుమార్ అన్నారు. సోమవారం డీఎంహెచ్‌వోలో డాక్టర్ పాల్వన్‌కుమార్ అధ్యక్షతన 22 పీహెచ్‌సీల పరిధుల్లోని డాక్టర్లు, పారామెడికల్ సిబ్బందికి మెదడువాపు వ్యాధి నివారణకు ఇచ్చే జేఈ టీకా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం రాష్ట్రంలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, మల్కాజ్‌గిరి, వికారాబాద్ జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా జరుగుతున్నదన్నారు. 6 నుంచి 15 ఏండ్లలోపు ఉన్న పిల్లలకు పాఠశాలల్లో ఈ టీకా వేస్తారన్నారు. అదేవిధంగా 9 నెలల నుంచి ఐదేండ్ల లోపు ఉన్న పిల్లలకు కూడా అంగన్‌వాడీ కేంద్రాల్లో వేస్తారన్నారు. జేఈ వ్యాక్సినేషన్ కార్యక్రమం జిల్లాలో ఈనెల 25న ప్రారంభం అవుతుందన్నారు. డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ మురారి జేఈ వ్యాక్సినేషన్ ప్రాధాన్యాన్ని వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బుచ్చిబాబు, 22 పీహెచ్‌సీల పరిధుల్లోని మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

షాబాద్ ప్రభుత్వ దవాఖానలో మాట్లాడుతున్న జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ దామోదర్

వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలి

రంగారెడ్డి జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ దామోదర్

షాబాద్, జూలై 15 : వైద్య సిబ్బంది సమయపాలన పాటించకుంటే కఠిన చర్యలు తప్పవని రంగారెడ్డి జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ దామోదర్ హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను ఆయన సందర్శించి సిబ్బంది హాజరు, ఓపీ సంఖ్య తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిబ్బంది అందుబాటులో ఉండి పేదలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే సహించమన్నారు. ప్రస్తుతం డెంగీ, తదితర విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓ గ్రామంలోని ఓ ఇంట్లో ఫీవర్ వచ్చిందని గుర్తిస్తే, ఆ ఇంటికి నలుమూలల ఉన్న వంద ఇండ్లల్లో సర్వేచేయాలని, సర్వే చేసిన దాంట్లో 10శాతం కేసులు పాజిటివ్‌గా వస్తే ఆ గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేయాలన్నారు. అక్కడ ఆర్ ఎంపీ డాక్టర్లు సొంత వైద్యం చేస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆర్‌ఎంపీ డాక్టర్లు కేవలం ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలని, మిగతా ఏమన్నా ఉంటే సంబంధిత ఆశవర్కర్, ఏఎన్‌ఎం, సూపర్‌వైజర్, ప్రభుత్వ దవాఖానలకు సమాచారం ఇవ్వాలన్నారు. ఆయన వెంట సీహెచ్‌వో గోపాల్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, ఫార్మాసిస్ట్ శంకర్, సిబ్బంది తదితరులున్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

మొయినాబాద్, జూలై 15 : ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు కొందరు యత్నిస్తున్నారని రంగారెడ్డి కలెక్టర్ శశాంకకు స్థానికులు ఫిర్యాదు చేశారు. చిలుకూరు రెవెన్యూలోని 277సర్వేనంబర్‌లో 1.03 ఎకరాల ప్రభుత్వ భూమి హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి, సురభి వెంచర్‌ను ఆనుకుని ఉన్నది. కాగా కేసీఆర్ ప్రభుత్వం ఈ భూమిలో పేదల కోసం డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించాలని సంకల్పించగా అప్పటి మంత్రి సబితా రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్యలు డబుల్‌బెడ్ రూమ్‌ల కోసం శంకుస్థాపన కూడా చేశారు. అయితే సురభి వెంచర్‌లో ఉన్న కొందరు ఆ భూమిని పార్కుగా చూపి కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని.. అందులో మొక్కలు కూడా నాటారని శ్రీనివాస్, విక్రమ్‌రెడ్డి, సంతోష్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దాదాపు రూ.20 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జా అవుతున్నదని.. దానిని కాపాడాలని వారు కోరారు.



స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లు పెంచాలి

కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతానికి పెంచాలని బీసీ ఫ్రంట్ తెలంగాణ చైర్మన్ మల్లేశ్ ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లేశ్ మాట్లాడుతూ.. బీసీ కులగణన చేసి బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు పెంచి న్యాయం చేయాలని సూచించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో బీసీ ఫ్రంట్ నాయకులు సత్యనారాయణ, కృష్ణ, గోపాల్, రామకృష్ణ, వంశీకృష్ణ, సతీష్, రఘుపతి తదితరులున్నారు.

–ఇబ్రహీంపట్నం, జూలై 15

2008 డీఎడ్ అభ్యర్థులకు న్యాయం చేయాలి

2008 డీఎస్సీలో క్వాలిఫై అయిన డీఎడ్ అభ్యర్థులకు న్యాయం చేయాలని వికారాబాద్ జిల్లా డీఎడ్ అభ్యర్థులు సోమవారం హైదరాబాద్‌లో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. 2008 డీఎస్సీలో ఎంపిక జాబితా, మెరిట్ లిస్టుల్లో తమ పేర్లు వచ్చాయని.. సర్టిఫికెట్ల వేరిఫికేషన్ కూడా జరిగిందని వివరించారు. మంత్రిని కలిసిన వారిలో వికారాబాద్ జిల్లాకు చెందిన డీఎడ్ అభ్యర్థులు రఘు, కిశోర్, ప్రవీణ్, రవి, రాం ప్రసాద్, అనూష, మంజుల, లత, కవిత, జగన్నాథ్ రెడ్డి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

–వికారాబాద్, జూలై 15

సిరిపురం కల్వర్టు వద్ద బురదలో దిగబడిన ఆర్టీసీ బస్సు..

బురదలో దిగబడిన ఆర్టీసీ బస్సు

- **భయాందోళనకు గురైన ప్రయాణికులు**
- **జేసీబీ సహాయంతో బయటికి..**

మర్పల్లి, జూలై 15 : బురదలో చిక్కుకుపోయిన ఆర్టీసీ బస్సును జేసీబీ సహాయంతో బయటికి తీశారు. ఈ ఘటన మండలంలోని సిరిపురం సమీపంలో సోమవారం జరిగింది. గ్రామస్తులు, ప్రయాణికులు తెలిపిన ప్రకారం.. మర్పల్లి నుంచి మోమిన్‌పేటకు వెళ్లే ప్రధాన రోడ్డులో సిరిపురం గ్రామ సమీపంలోని రోడ్డుపై కల్వర్టును నిర్మిస్తున్నారు. అందుకోసం తాత్కాలిక రోడ్డును కూడా ఏర్పాటు చేశారు. అయితే రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆ దారి బురదమయంగా మారింది. సోమవారం ఉదయం వికారాబాద్ నుంచి మర్పల్లికి వస్తున్న ఆర్టీసీ బస్సు ఆ కల్వర్టు వద్ద బురదలో కురుకుపోయింది. దీంతో అందులో ఉన్న ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. దీంతో స్పందించిన ఆర్టీసీ సిబ్బంది గ్రామస్తుల సహకారంతో జేసీబీని తీసుకొచ్చి ఆ బస్సును బయటికి తీశారు. ఎండాకాలంలో కల్వర్టు పనులు చేపట్టకుండా వానకాలంలో చేయడంపై సంబంధిత కాంట్రాక్టర్‌పై గ్రామస్తులు, ప్రయాణికులు మండిపడ్డారు. త్వరగా పనులను పూర్తి చేయించాలని సూచించారు.

విద్యారంగానికి అధిక ప్రాధాన్యం

- **కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**
- **కేజీబీవీ నూతన భవనం సందర్శన**

కడ్తాల్, జూలై 15 : విద్యారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రం సమీపంలో నూతనంగా నిర్మించిన కేజీబీవీ పాఠశాల భవనాన్ని ఈ నెల 17న రాష్ట్ర మంత్రులు ప్రారంభించనున్న నేపథ్యంలో సోమవారం ఎంఈవో సర్దార్‌నాయక్, ఎంపీడీవో సుజాత, పాఠశాల ప్రిన్సిపాల్ అనిత, ఎంఎన్‌వో జంగయ్య, స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా భవనంలోని తరగతి గదులు, వంటశాల, నీటివసతి, విద్యుత్ తదితర సౌకర్యాలను పరిశీలించారు. పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న చిన్న, చిన్న పనులను రెండు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎంబీఏ గార్డెన్స్‌లో ఏర్పాటు సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేజీబీవీ కొత్త భవనాన్ని ప్రారంభించేందుకు బుధవారం మండల కేంద్రానికి రాష్ట్ర మంత్రులు, ఎంపీ హాజరు కానున్నారన్నారు. కేజీబీవీ భవనాన్ని ఈ విద్యాసంవత్సరం మొదట్లోనే ప్రారంభించాలని భావించగా, కొన్ని పనులు పెండింగ్‌లో ఉండటంతో ప్రారంభించలేదన్నారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేసి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శ్రీధర్‌బాబును గత నెలలోనే కలిసి ప్రారంభించాలని కోరగా.. మంత్రికి ముందే ఖరారైన బీజీ షెడ్యూల్ కారణంగా భవనాన్ని నిర్ణీత సమయంలో ప్రారంభించలేదన్నారు. పాఠశాలను ఈ నెల 17న ప్రారంభిస్తామని ఈ నెల 13న ప్రకటన విడుదల చేసినా.. ప్రతిపక్షాలు ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టడం సరికాదన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి..

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కడ్తాల్ మండల కేంద్రం నుంచి చల్లంపల్లి గ్రామం మీదుగా పడకల్ గేట్‌వరకు రూ.14.60 కోట్లతో చేపట్టిన బీటీ డబుల్ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, ఆర్‌అండ్‌బీ డీఈఈ సీతారామయ్య, ఏఈ విజయ్, నాయకులు నర్సింహ, భాస్కర్‌రెడ్డి, భీక్యానాయక్, బీచ్చానాయక్, చందోజీ, యాదగిరిరెడ్డి, వేణుగోపాల్, శంకర్, లక్ష్మయ్య, జహంగీర్‌అలీ, రాములుగౌడ్, లక్ష్మణ్‌నాయక్, శేఖర్‌గౌడ్, హీరాసింగ్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

కేజీబీవీ భవనం ఎదుట ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

హెచ్‌సీయూ స్టేట్స్ లీగ్స్‌కు చైత్రారెడ్డి ఎంపిక

పెద్దేముల్, జూలై 15 : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ స్టేట్స్ లీగ్స్‌కు చైత్రా రెడ్డి ఎంపిక య్యారు. మండలంలోని గిర్మాపూర్ గ్రామానికి చెందిన చైత్రా రెడ్డి ప్రస్తుతం తాండూరు పట్టణంలోని మల్‌రెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నది. క్రికెట్‌పై ఉన్న ఇష్టంతో ఒకవైపు చదువుకుంటూ.. మరోవైపు తాండూరు లెజెండ్స్ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్నది. జూన్ 30న హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ స్టేట్స్ లీగ్స్‌కు సెలక్షన్స్ జరుగగా అందులో చైత్రారెడ్డి అండర్ –15 విభాగంలో ఎంపిక అయ్యారు. ఆమె ఎంపిక కావడంతో కోచ్‌లు సొహైల్, సాహిల్, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్తులు చైత్రారెడ్డిని అభినందించారు.

జల మండలిలో బదిలీలను ఆపాలి

బోర్డు ఎదుట బీఆర్‌టీయూ అనుబంధ యూనియన్ నిరసన

ఎండీ అశోక్ రెడ్డికి వినతిపత్రం సమర్పించిన నాయకులు

సిటీబ్యూరో, జూలై 15(నమస్తే తెలంగాణ): జల మండలిలో జనరల్ బదిలీలను వెంటనే నిలిపివేయాలని సోమవారం బీఆర్‌టీయూ అనుబంధ వాటర్ వర్క్స్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఎండీ అశోక్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు రాంబాబుయాదవ్, చీఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారాయణ నాయకత్వంలో బోర్డు కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. జలమండలిలో పనిచేసే కార్మికులను ఇతర శాఖలతో పోల్చవద్దని ఎండీకి వివరించారు. ఎలాంటి విధి విధానాలు లేకుండా బదిలీలు చేయడం ద్వారా కార్మికులంతా ఆందోళన చెందుతున్నారని, అకడమిక్ మధ్యంతరంగా బదిలీలు చేయడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఎండీకి చెప్పారు. బదిలీలు ఆపకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని రాంబాబు యాదవ్, నారాయణ హెచ్చరించారు. వినతిపత్రంపై సానుకూలంగా స్పందించిన ఎండీ అశోక్‌రెడ్డి కార్మికులకు ఇబ్బందులు రాకుండా చూస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు లక్ష్మీ నారాయణ, షకీల్, జంగయ్య, రవీందర్, కొమురయ్య, మల్లేశ్, అంజయ్య పాల్గొన్నారు.